**జరిగిన కథ :** జాయపుని కళల కళాక్షేత్రం.. కూసెనపూండి కళాక్షేత్రం. కళాకారులకు ఇప్పుడొక తీర్థయాత్రా స్థలం. వెలనాడులోని సమస్త కవి పండిత వాద్య గాయక ప్రదర్శన కళాకారులకు స్వర్గధామం. సాధారణ పౌరులు కూడా కళాస్వర్గంలో ఉన్నామా!? అన్నట్లు.. కళ్లు తిప్పుకోలేనంత రమణీయ శిల్పశోభలతో అలరారుతున్న ప్రాంగణం. అన్ని సాహితీ కళా రంగాలలో కొత్త కొత్త సంప్రదాయాలను సృష్టిస్తున్న వాగ్గేయకారుల ఆవాసం. ఆ క్షేత్రంలో ఆరోజు విద్వత్ గోష్ఠి జరుగుతున్నది.



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

అప్పుడే లోనికి ప్రవేశించిన ఇద్దరు పండితులు జాయపునికి నమస్కరించి కూర్చున్నారు. చర్చలో పాల్గొన్నారు.

అప్పుడే ఒకరు లేచి..

''తమరిని ఎక్కడో చూసినట్లుంది స్వామీ..'' అన్నాడు.

గతుక్కుమన్నాడు జాయపుడు.

''బహుశా అనుమకొండ ప్రభువుల ఆస్థానంలో చూసి ఉంటారు తమరు..'' అన్నాడు మరొకరు.

'ఓహో.. ఈయన గారికి అలా అర్థమయ్యిందా!?'.. నోరు కట్టేసుకున్నాడు జాయపుడు.

''సాక్షాత్తూ గణపతిదేవుల వారి రాజబంధువులు అంటే సామాన్యమా..?!'' మరో పండితుడు చేతులు జోడించాడు కూడా.

మహారాజులపై స్తోత్రపాఠాలు రాయడంతో మొదలవుతుంది.. ఎక్కువమంది పండితుల సాహిత్య రచన. కాబట్టి పొగడ్తలకేమీ తక్కువ కాదు.

''కాదుకాదు.. ఇక్కడే మన వెలనాడు ప్రభువుల ఆస్థానంలో చూసినట్లు గుర్తు..'' మొదటివాడు వదలడం లేదు.

''అవును! వెలనాడు ప్రభువులు వారి బంధుగణం మహాదొడ్డ ప్రభువులు. వారు అన్నదమ్ములు, జ్ఞాతి సోదరులు ఒక్కలా ఉంటారని విన్నాను!''.

''అసలు వెలనాడు ప్రభువులను చూశావా!?''.

''అబ్బే! రోజూ దర్శించుకోవడానికి వారేమైనా గుడిలో విగ్రహాలా.. మహారాజులు! వారి పట్టాభిషేకానికి వెళ్లాను. కానీ అప్పటికే ఆలస్యం అయ్యింది. ఆ శుభ కార్యం పూర్తయ్యి వారు లోపలికి వెళ్లిపోయారు. కానీ, సంభావన ముట్టింది లెండి!''.

మహారాజులను చూడటం సామాన్యులకే కాదు.. ప్రముఖులకు కూడా సాధ్యం కాదు. మహారాజును చూడటానికి గ్రామాల నుంచి, పురాల నుంచి వెళ్లడం సాధ్యపడదు. కొన్ని పండుగలలో, ఉత్సవాలలో మాత్రమే చాలామంది సామాన్యులు మహారాజులను, రాజబంధువులను చూడటం జరుగుతుంది.

''సరే సరే.. అసలు చర్చ పక్కదారి పట్టించకు కవి వర్యా..'' అంటూ జాయపుని వృత్తాంతం వదిలేశారు.

అయితే ఎప్పుడో ఒకప్పుడు గోష్ఠులలోనే తన పేరు, వివరాలు చెప్పాల్సి వస్తుందని జాయపుడు సిద్ధంగానే ఉన్నాడు.

''అలసిపోతిని చాలుసామి నీ చాతుర్య రతికి
పలకరింపకు నన్ను పవ్వళింపనిమ్ము నేటికి
చేర రమ్మని పిలిచి చెక్కిలి ముద్దాడి
సురతకేళుల దేల్చి సొలియజేసితి వెంతో
సరసాల రాయుడా సరిలేరు నీసాటి
ధీరుడా సమరతులింకేల చాలును పోరా..''

నర్తిస్తూ పాడుతూ చక్కని పాదాల కదలిక.. హస్త ముద్రలు.. కరణలు.. మొత్తంగా ఓ అబ్బురం! రెప్పవేయకుండా చూస్తుండి పోయాడు జాయపుడు.

అతను వరదయ. అతణ్ని భాగవత సిద్ధయ గోష్ఠికి తీసుకుని వచ్చి జాయపునికి పరిచయం చేశాడు.

''స్వామీ.. ఇతను వరదయ. మా కూసెనపూండి